# అలా వదిలేశారు..!


వాలిచర్లలో అర్ధాంతరంగా నిలిచిన సచివాలయం


వాలిచర్లలో అసంపూర్తిగా నిలిచిన రైతు భరోసా కేంద్రం

- అర్ధాంతరంగా నిలిచిన సచివాలయ నిర్మాణాలు
- పూర్తయినా ప్రారంభానికి నోచుకోనివి ఎన్నో
- గ్రామ సచివాలయ వ్యవస్థకు ప్రభుత్వం తూట్లు
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు

**హనుమంతునిపాడు:** గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ స్వరాజ్యం దిశగా పంచాయతీ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఇందులో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి పంచాయతీలో గ్రామ సచివాలయ,, ఆర్‌బీకే కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రతి పంచాయతీలో నూతన భవనాలు రూపుదిద్దుకున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కక్ష కట్టింది. అప్పటి వరకు శరవేగంగా సాగిన వీటి నిర్మాణాలు కూటమి ప్రభుత్వం రాగానే ఒక్కసారిగా నిలిచిపోయాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ఎక్కడి పనులు అక్కడ నిలిపివేశారు. మండలంలోని వాలిచర్ల, సీతారాంపురం, తిమ్మారెడ్డిపల్లి, లింగంగుంట్ల, నందనవనం, ముప్పళ్లపాడు, పెద్దగొల్లపల్లి పంచాయతీల్లోని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. వీటి నిర్మాణానికి స్వల్ప నిధులు మంజూరు చేసినా నిర్మాణాలు పూర్తవుతాయి. కానీ ప్రభుత్వం వీటి గురించి పట్టించుకోవడం లేదు. దీంతో అద్దె భవనాల్లోనే ఈ కార్యాలయాలు నడుస్తున్నాయి. ఎన్నికలకు ముందు కొన్ని భవన నిర్మాణాలు పూర్తయినా ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాటిని ప్రారంభించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పూర్తయిన వాటి భవనాలను సైతం ప్రారంభించడం లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి పూర్తి చేసిన భవన నిర్మాణాలు ప్రారంభిస్తే వినియోగంలోకి తీసుకురావచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు. దీంతో హాజీపురం, కూటాగుండ్ల, ముప్పళ్లపాడు, వేములపాడు, హనుమంతాపురం, నందనవనం సచివాలయాలు, పెద్దగొల్లపల్లి, తిమ్మారెడ్డిపల్లి, హాజీపురం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్‌లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

# బాలికల విద్యే అభివృద్ధికి తొలిమెట్టు

**పామూరు:** బాలికల సంపూర్ణ అక్షరాస్యతే సమాజాభివృద్ధికి తొలిమెట్టు అని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో శనివారం బాల్య వివాహాల నిషేధం, బాలికల అక్రమ రవాణా, బాలికలపై అత్యాచారాలను నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం వంటి అంశాలపై సమీక్షించారు. ఎంపీడీఓ బ్రహ్మయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను 3 ఏళ్లు వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని, 6 ఏళ్లు నిండిన వెంటనే ప్రభుత్వ పాఠశాలకు పంపాలన్నారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఎంఈఓ జి.కరుణకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఎస్.చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీఓ దేవకృపావరం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

**సీఎస్‌పురం(పామూరు):** అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాలకు వచ్చే పిల్లల హాజరుశాతాన్ని పెంచడంతో పాటు కేంద్ర నిర్వహణలో, పౌష్టికాహార పంపిణీలో సమయపాలన పాటించి ఆదర్శ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సీడీపీఓ కె.దేవకృపావరం, ఎంఈఓ జె.ప్రసాదరావు అన్నారు. స్థానిక వడ్డెపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి సమావేశాన్ని విధిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, జవాబుదారీతనంగా పనిచేయాలని సూచించారు. ఈసందర్భంగా ఉద్యోగోన్నతపై సీడీపీఓగా బాధ్యతలు చేపట్టిన కృపావరాన్ని అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాదరావు, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గంధం సామ్యేలు, యాక్టివ్ సూపర్‌వైజర్ సరళారెడ్డి, రజని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యాటకులపై దాడి హేయమైన చర్య


సంతాపం పాటిస్తున్న ఎంపీడీఓ రామాంజనేయులు, కార్యాలయ సిబ్బంది

**కొండపి:** జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై దాడి అత్యంత హేయమైన చర్య అని ఎంపీడీఓ రామాంజనేయులు అన్నారు. ఉగ్ర దాడిలో మరణించిన పర్యాటకులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంతాపం ప్రకటించి రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్ర దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించామన్నారు. మరణించిన కుటుంబాల సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ రామకష్ణ, ఉపాధి హామీ పథకం సిబ్బంది, వెలుగు సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమావేశం

**పామూరు:** స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత మదన వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆదివారం సాయంత్రం 4 గంటలకు కులసంఘాల నాయకులు, ఉభయాల నిర్వాహకులకు సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు శనివారం తెలిపారు. బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటుచేసే ముందస్తు సమావేశానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని ఈఓ కోరారు.



## క్లుప్తంగా

### పిన్నికను సత్కరించిన నేతలు


పిన్నికను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

**జరుగుమల్లి(సింగరాయకొండ):** వైఎస్సార్ సీపీ జరుగుమల్లి మండల అధ్యక్షునిగా నియమితులైన పిన్నిక శ్రీనివాసులను శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా సన్మానించారు. పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు కనపర్తి శేషారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బత్తిన మనోహర్‌రావు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు కొమ్మాలపాటి మధుసూదనరావు, సర్పంచ్ కసుకుర్తి పున్నారావు, ఉప సర్పంచ్ దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, చుండి సురేష్, కుండా చెంచురెడ్డి, వెంకారెడ్డి, కాకి జయపాల్ పాల్గొన్నారు.

### యోగాతో మానసిక ఒత్తిడి దూరం


యోగాసనాలు చేస్తున్న సీఐ సోమశేఖర్, ఎస్సైలు

**కొండపి:** యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని సీఐ సోమశేఖర్ అన్నారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి యోగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని కచ్చితంగా రోజు వ్యాయామం చేయాలని సూచించారు. కేసుల పరిశోధనలో సాంకేతికను ఉపయోగించుకోవాలని, స్టేషన్‌కి వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఆయా మండలాల్లో సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని సిబ్బంది ఆయా స్టేషన్ల ఎస్సైలకు తెలియపరచాలన్నారు. రౌడీషీటర్లను, సస్పెక్ట్ షీట్లు కలిగిన వ్యక్తులను గమనిస్తూ వారిపైనే ఉంచాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. మైనర్లు వాహనాలు నడపకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్, పొన్నలూరు ఎస్సై అనూక్, ఏఎస్సై అంకారావు, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం


పొన్నలూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత


మాట్లాడుతున్న తహసీల్దార్ జ్వాలా నరసింహారావు

**పొన్నలూరు:** బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణా తరగతులను శనివారం ఎంపీడీఓ డాక్టర్ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి ఉచిత టైలరింగ్ శిక్షణను ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణ 70 రోజుల పాటు 144 మంది పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేశ్వరరావు, ఏపీఎం శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, కర్నా కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మర్రిపూడి:** స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణా తరగతులను తహసీల్దార్ జ్వాలా నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా 135 కుట్టుమిషన్లు వచ్చాయని, మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ రామాంజనేయులు, ఎంపీడీఓ జగదీష్, ట్రైనర్ లక్ష్మిశెట్టి సుజాత, ఓపీ చేరెడ్డి నందిని, ఏపీఎం కోటేశ్వరరావు, వై శ్రీనివాసులు, సీహెచ్ చిన్న నరసారెడ్డి, జి.హనుమారెడ్డి, ఆర్ వీరనారాయణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


పామూరులో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై కిషోర్‌బాబు

**పామూరు:** అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై టి.కిషోర్‌బాబు అన్నారు. పామూరులోని లాడ్జిలు, 167బి, 565 జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్సై మాట్లాడుతూ ఎక్కడైనా అనుమానంగా గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహనాలను మైనర్లకు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. ప్రతి వాహనదారుడు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి మాత్రమే ప్రయాణం సాగించాలన్నారు. ఎవరైనా బాలికలు, మహిళల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హెడ్ కానిస్టేబుల్ పి.దాసు, సిబ్బంది మోడి వెంకటేశ్వర్లు, గోనె శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పొగాకు కనిష్ట ధర రూ.225


వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

**టంగుటూరు:** స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శనివారం నిర్వహించిన వేలంలో కనిష్ట ధర రూ.225 పలికింది. వేలానికి దావగూడూరు, చింతలపాలెం గ్రామాలకుచెందిన రైతులు 699 బేళ్లను తీసుకురాగా వాటిలో 600 బేళ్లను కొనుగోలు చేసి 99 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, సరాసరి ధర రూ.259.97గా నమోదైంది. వేలంలో 19 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

**కొండపి:** స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం వేలంలో 165 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. కేంద్రానికి క్లస్టర్ పరిధిలోని మూగచింతల, నెన్నూరుపాడు, గుర్రపడియ, చతుకుపాడె. కె.అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు 917 బేళ్లను తీసుకురాగా 752 బేళ్లనుకొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.225 పలికింది. వేలంలో 17 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

**కనిగిరిరూరల్:** లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ సృజన అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం పీసీ–పీఎన్‌డీటీ యాక్ట్ సబ్ డివిజనల్ లెవిల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకు తగ్గుతున్న బాలికల శాతాన్ని పెంచాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ చేస్తే జైలుశిక్ష, జరిమానా విధిస్తారన్నారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ కమిటీ సభ్యులు, బంగారు బాల్యం కమిటీ సభ్యులు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల ముమ్మర తనిఖీలు


టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

**టంగుటూరు:** జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో జిల్లాలో పోలీసులు ముమ్మర తనిఖీలుచేస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు టోల్‌ప్లాజా, ఆర్టీసీ డిపో, రద్దీగా ఉండే కూడళ్లలో సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఏఎస్సై రవి, సిబ్బంది పాల్గొన్నారు.

**సింగరాయకొండ:** ఉగ్ర దాడి నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సింగరాయకొండలో పోలీసులు తనిఖీ చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, మార్కెట్ సెంటర్‌లలో డాగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. తనిఖీల్లో ఆర్ఎస్సై ఎస్‌వీ శివప్రసాద్, 8 మంది సభ్యుల బృందం పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ బృందం

**సింగరాయకొండ:** మీ పిల్లలను బాగా చదివిస్తాం మా పాఠశాలలో చేర్పించండని కోరుతూ శనివారం పాతసింగరాయకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ పద్మజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. పీఈటీ అన్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కనిగిరిరూరల్:** పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. పట్టణ పరిధిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# ఉగ్ర దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ


కనిగిరిలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన


సింగరాయకొండలో నివాళులర్పిస్తున్న దృశ్యం

**కనిగిరిరూరల్:** జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ.. శనివారం కనిగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇటువంటి దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. బషీరా, ప్రసన్న, శాంతకుమారి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జర్నలిస్టుల ఆధ్వర్యంలో కనిగిరిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

**సింగరాయకొండ:** ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు శనివారం రాత్రి గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. ఈ సందర్భం అసోసియేషన్ అధ్యక్షుడు బచ్చు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉగ్రవాదులను ఏరివేసి శాంతిని పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించి మరణించిన వారికి నివాళులు అర్పించారు.